సాక్షి మంచిర్యాల

మంగళవారం : 28 : మార్చి : 2023



యాదాద్రి తరహాలో 'అడెల్లి'

యాదాద్రి ఆలయం తరహాలోనే అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని కృష్ణ శిలలతో పునర్నిస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 10లో▸



మాకూ పే స్కేల్ వర్తింపజేయాలి

పే స్కేల్ వర్తింపజేయాలని, సెర్ప్ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలని జిల్లాలో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం, సమగ్ర శిక్షఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

ప్రజల్లోకి పాల ఉత్పత్తులు



ట్రయల్‌రన్ పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

బెల్లంపల్లి: విజయ పాల ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విజయ డెయిరీ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం బెల్లంపల్లి కన్నాలబస్తీలో ఏర్పాటు చేస్తున్న పాల శీతలీకరణ కేంద్రంలో ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పాల కేంద్రాలు, డెయిరీ పార్లర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 3,187 మంది పాడి రైతులు ఉన్నారని, రోజుకు గరిష్ఠంగా 8 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందని, అందులో నుంచి 6 వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నామని వివరించారు. ముఖ్యమైన పట్టణాల్లో మిల్క్ పార్లర్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. లక్సెట్టిపేట విజయ డెయిరీ మేనేజర్ నవీన్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం బెల్లంపల్లి చైర్మన్ బొద్దున వెంకటేష్, జిల్లా మిల్క్ ట్రేడర్ భావనరుషి, సేల్స్ ఇంచార్జి సతీష్, నారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 329 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 7,302 మందికి గాను 6,973 మంది విద్యార్థులు హాజరుకాగా 329 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6,401 మందికి గాను 6,116 హాజరు కాగా 285 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 901 మందికి గాను 857 మంది హాజరు కాగా 44మంది గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవ కార్యక్రమాలపై సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సంక్షేమం దిశగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వార్షిక సర్వసభ్య సమావేశం, జిల్లా రెడ్‌క్రాస్ సభ్యుల ఎన్నికల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, పడాల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, ఎస్.నాగేందర్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే'



మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడడంతో చట్ట ప్రకారం ఎంపీ పదవి నుంచి సస్పెండ్ చేయడంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒక్కటై బీజేపీపై ఆరోపణలు చేస్తున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్ట ప్రకారం ఒక ప్రజాప్రతినిధికి రెండేళ్ల జైలు శిక్ష పడితే అనర్హులుగా ప్రకటించాలని ఉందని, ఆ చట్టాన్ని అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. బీజేపీపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చేస్తున్న ఆరోపణలు ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ పరీక్షల పేపర్ల లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, ఇందుకు కారణమైన బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా కాంగ్రెస్ నిలిచి ఆందోళనలను విస్మరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజనీశ్ జైన్, అందుగుల శ్రీనివాస్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పులగం తిరుపతి, తులా ఆంజనేయులు, బొమ్మెన హరీష్ గౌడ్, అక్కల రమేశ్, రాచర్ల సంతోష్, అలం బాపు, సత్యం, రాజబాబు పాల్గొన్నారు.

మళ్లీ కరోనా భయం..!



కోవిడ్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- మాస్క్ ధరించాలంటున్న వైద్యులు
- కోవిడ్ వ్యాక్సినేషన్ నిలిపివేత
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే పరీక్షలు
- ఈ నెలలో మూడు పాజిటివ్ కేసులు

మంచిర్యాలటౌన్: ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. కోవిడ్–19 కేసులు పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. గత నెలన్నర రోజులుగా జిల్లాలో వైరల్ జ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతోంది. దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరంతో వారం రోజులకు పైగా బాధపడుతున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా త్వరగా నయం కాకపోవడం, ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకడంతో వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం నుంచి బయటపడే సమయంలో నిమోనియాగా మారి శ్వాసకోశ సంబంధిత వ్యాధికి గురవుతున్నారు. ఇన్‌ఫ్లూయెంజా(హెచ్3, హెచ్2) లక్షణాలతో కూడిన జ్వరాలు వస్తున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. వాతావరణం పగలంతా వేడి, రాత్రంతా చల్లగా ఉండడం, వర్షాలు కురుస్తుండడం, వాతావరణంలో మార్పులతో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాల బాధితులు మందుల దుకాణాల్లో గోలీలు కొని వాడకుండా, తప్పనిసరిగా ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యులు ఇచ్చే మందులు, చికిత్స తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కరోనా మళ్లీ విజృంభిస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరికల నేపథ్యంలో కరోనా టెస్టులు నిలిపివేయడం, వ్యాక్సినేషన్ ప్రక్రియను చేపట్టకపోవడంతో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మాత్రమే ఆర్టీపీసీఆర్ ద్వారా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెలలో జిల్లాలోని 358 మందికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా, ముగ్గురికి కరోనా పాజిటివ్‌లు రాగా, గత నెలలో ఒక పాజిటివ్ కేసు నమోదైంది.

జిల్లాలో మార్చి 27వరకు కోవిడ్ వివరాలు

పరీక్షలు	10,75,447
పాజిటివ్ కేసులు	57,305
మృతులు	205
మార్చిలో పరీక్షలు	358
పాజిటివ్ కేసులు	3

జిల్లాలో టీకాలు వేసుకున్న వారు, టీకా నిల్వలు

లక్ష్యం	5,36,900
మొదటి డోసు	5,42,986
రెండో డోసు	5,60,388
బూస్టర్ డోసు అర్హులు	5,53,103
బూస్టర్ డోసు వేసుకున్నది	2,99,094 (54శాతం పూర్తి)
కోవిషీల్డ్ వ్యాక్సిన్ నిల్వలు	0 డోసులు
కోవ్యాగ్జిన్ వ్యాక్సిన్ నిల్వలు	100 డోసులు

వ్యాక్సినేషన్‌కు స్వస్తి

జిల్లాలో గత ఏడాది వరకు కరోనా వ్యాక్సినేషన్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టగా, ఈ ఏడాది జనవరి వరకు మాత్రమే వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగింది. ఆ తరువాత వ్యాక్సిన్ రాకపోవడం, కోవ్యాగ్జిన్ వ్యాక్సిన్ 100 వాయిల్స్ ఉన్నా, వేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వ్యాక్సినేషన్ ప్రక్రియకు స్వస్తి చెప్పారు. కోవ్యాగ్జిన్ వ్యాక్సిన్ ఎక్స్‌పైరీ ఈ నెలాఖరు వరకే ఉండడంతో మరో మూడు రోజుల్లోనే వేయాల్సి ఉంటుంది. జిల్లాలో కరోనా టీకాలకు 18 ఏళ్లు నిండిన వారిలో 5,36,900 మందిని గుర్తించగా, లక్ష్యం కంటే అధికంగా మొదటి డోసు వ్యాక్సిన్‌ను 5,42,986 మందికి, రెండవ డోసు 5,53,103 మందికి వేశారు. కరోనా వ్యాక్సిన్‌ను ఇతర ప్రాంతాల వారు జిల్లాలో వేసుకోవడం వల్ల 100 శాతానికి పైగా మొదటి, రెండవ డోసు లక్ష్యాన్ని పూర్తి చేసుకోగలిగింది. బూస్టర్ డోస్‌కు అర్హత సాధించిన వారిలో 2,99,094 మంది అంటే 54 శాతం మాత్రమే వేసుకున్నారు. బూస్టర్ డోస్ వేసుకునేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో గత నెల నుంచి వ్యాక్సినేషన్ నిలిపివేశారు.

అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో కరోనా టెస్టులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్టీపీసీఆర్ టెస్టులుగా చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కు ధరించాలి. క్రమం తప్పకుండా చేతులు శుభ్రపరుచుకోవడం, శానిటైజర్‌ను వినియోగించుకోవాలి. గుంపులుగా ఉన్నచోట జాగ్రత్తలు పాటించి, మాస్కులతోనే వెళ్లాలి. తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి, ముక్కుకు అడ్డుగా రుమాలును అడ్డు పెట్టుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

పన్నులు వందశాతం వసూలయ్యేనా..!



హాజీపూర్‌లో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

- జిల్లాలో ఇప్పటివరకు 83.24శాతం వసూళ్లు
- ప్రథమ స్థానంలో కన్నెపల్లి మండలం
- చివరి స్థానంలో తాండూర్ మండలం
- కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్
- రాష్ట్రంలో పదో స్థానంలోపు జిల్లా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని పంచాయతీల్లో ఇంటిపన్నులు వంద శాతం వసూలయ్యేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు 84.24శాతం వసూలయ్యాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు రోజుల్లో 16.76శాతం వసూలు కావడం గగనంగానే కనిపిస్తోంది. పన్నుల చెల్లింపుల్లో కొందరు స్వచ్ఛందంగా ముందుకు వస్తుండగా.. మరికొందరు ఇంటికి వెళ్లి అడిగితే గానీ చెల్లించడం లేదు. పన్నుల వసూళ్లలో జిల్లా ప్రస్తుతం రాష్ట్రంలో 10వ స్థానంలో ఉంది. మొదటి స్థానం సాధించేందుకు అధికార యంత్రాంగం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు, మంచినీటి కుళాయి బిల్లుల వసూళ్లను వంద శాతం సాధించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండడంతో గ్రామాల్లో పన్నుల వసూళ్ల కోసం నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు.

310 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 16 మండలాల్లో 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇంటి పన్నులు, ఇతర పన్నుల ద్వారా రూ.7,58,88,000 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు రూ.6,31,72,000 వసూలు అయ్యాయి. మిగతా రూ.1.27కోట్లు మూడు రోజుల్లోనే వసూలు చేయాల్సి ఉంది. వంద శాతం పన్నులు వసూలు చేసి జిల్లాను అగ్రభాగంలో నిలపాలని ఉన్నతాధికారుల సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు(ఎంపీవో), ఎంపీడీవోలతో ప్రత్యేకంగా సమావేశమై పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని స్పష్టం చేశారు. వంద శాతం పన్నుల వసూలుకు సమష్టిగా పని చేయాలని జిల్లా, మండలస్థాయి అధికారులు కార్యదర్శులకు పదే పదే సూచిస్తున్నారు. జిల్లాలోని కన్నెపల్లి మండలం 96.11శాతం పన్నుల వసూలుతో మొదటిస్థానంలో నిలువగా, తాండూర్ మండలం 71శాతంతో చివరి స్థానంలో ఉంది. భీమిని మండలం 92శాతం, లక్సెట్టిపేట 91, కాసిపేట 90, మందమర్రి 88, చెన్నూర్ 87, నెన్నెల 86, భీమారం 86, దండేపల్లి 86, వేమనపల్లి 85, హాజీపూర్ 84, బెల్లంపల్లి 81, కోటపల్లి 81, జైపూర్ 80, జన్నారం 80 శాతం పన్నులు వసూలు చేశాయి. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలతోపాటు మండల పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో కార్యదర్శులు పన్నుల వసూళ్లు వేగవంతం చేశారు. ఇంటి నిర్మాణాల అనుమతుల విషయంలో కీలకంగా వ్యవహరించే కార్యదర్శులు పన్నుల వసూళ్లలో ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప లక్ష్యం చేరేలా లేదు.

లక్ష్యం చేరుకునేలా..



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నులు వంద శాతం వసూళ్లను చేరుకునేలా చూస్తున్నాం. మిగిలిన పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం. తక్కువ శాతం వసూలైన గ్రామాలను గుర్తించి వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటాం. పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతుండగా పన్ను బకాయిలు ఉన్నవారు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- పోలీసుస్టేషన్ల తనిఖీ



కళ్లెంపల్లిలో వృద్ధుడికి బియ్యం అందజేస్తున్న సీపీ

కోటపల్లి: మహారాష్ట్ర, తెలంగాణ ప్రాణహిత సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని వెంచపల్లి, సుపాక ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలను ఆమె పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకుముందు కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర వంతెన వద్ద పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు పోలీస్‌స్టేషన్లతో సమన్వయ పర్చుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం నిరుపేదలకు దుస్తులు, బియ్యం, యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీ కేకేఎస్ సుధీర్ రాంనాథ్, ఏసీపీ నరేందర్, సీఐ వాసుదేవరావు, ఎస్సైలు వెంకట్, నరేశ్, సర్పంచ్ రాజుబాయి, సతీశ్, ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడాలి

వేమనపల్లి: గ్రామీణ యువత ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడాలని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. మండలంలోని కళ్లెంపల్లి గ్రామంలో సోమవారం పోలీసులు నిర్వహించిన కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది యువత చదువుకొని నిరుద్యోగులుగా మిగులుతున్నారని, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం సాధించేందుకు పోలీసు శాఖ తరఫున సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం వృద్ధులకు బియ్యం, మహిళలకు చీరలు, యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్, జైపూర్ ఏసీపీ నరేందర్, చెన్నూర్ టౌన్ సీఐ వాసుదేవరావు, నీల్వాయి, కోటపల్లి ఎస్సైలు నరేష్, వెంకట్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్



అర్జీలు అందించేందుకు బారులు తీరిన ప్రజలు

అర్జీలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

- దివ్యాంగురాలైన తన కూతురు సాగరవీణకు మూడేళ్లుగా పింఛన్ రావడం లేదని, పింఛన్ వచ్చేలా చూడాలని, సదరం సర్టిఫికెట్‌కు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా రావడం లేదని తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన బోగారపు లక్ష్మి విన్నవించింది.
- హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన కే.స్వామి తమ గ్రామస్తులకు గ్రామ శివారులో ఉన్న భూములు కడెం కాలువ ఆయకట్టు కింద సాగు చేస్తున్నారని, కొందరు కాలువ పక్కన దారిని కబ్జా చేయడంతో సాగునీరు రావడం లేదని విన్నవించాడు.
- మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన ఆర్.సుశీల తిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న భూమిని తన చిన్నాన్న తప్పుడు ఆధారాలతో ఆయన పేరిట పట్టా చేసుకున్నారని, విచారణ జరిపి పట్టా రద్దు చేయాలని కోరింది.
- కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన గొట్టిముక్కల వీర వెంకటరామారావు తనకు బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామశివారులో ఉన్న భూమికి రైతుబంధు రావడం లేదని అర్జీ సమర్పించాడు.
- నెన్నెల మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన గొల్లపల్లి శంకర్ తనకు గ్రామ శివారులో సేత్వార్ ప్రకారం భూమి పట్టా ఉందని, బ్లాక్ చేసినట్లు చూపడంతో రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నామని, అన్‌బ్లాక్ చేయాలని కోరాడు.
- భీమిని మండలం అక్కలపల్లి గ్రామానికి చెందిన ఇప్ప గంగయ్య తనకు కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామ శివారులో భూమి ఉందని, ఆన్‌లైన్‌లో ధరణిలో తన పేరు తప్పుగా నమోదైందని, సవరించాని కోరాడు.

పరిహారం అందించాలి



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురై ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారికి రూ.70 వేలు ఇంతవరకు మంజూరు చేయలేదు. గత నాలుగేళ్లుగా దరఖాస్తు చేసుకుంటున్నా ఇంతవరకు నగదు ఇవ్వలేదు. అధికారులు స్పందించి వెంటనే పరిహారం అందించాలి.

– కొట్టె లచ్చన్న, గ్రామం: కర్ణమామిడి, మం: హాజీపూర్

రక్షణ సూత్రాలు పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

జైపూర్: పని చేసే ప్రతి ప్రాంతంలో తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించాలని ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సోమవారం రక్షణ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీలోని ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కార్మికులను ఉద్దేశించి సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ మాట్లాడారు. రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని, పనిలో రక్షణపై ప్రత్యేకమైన శ్రద్ధతో పనిచేస్తే ప్రమాదాలు చోటుచేసుకోవని తెలిపారు. రక్షణ రంగంలో ప్రత్యేక కృషి చేసిన వారికి బహుమతులు అందజేశారు. వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం పీసీఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఏజీఎంలు శ్రీనివాసులు, టీబీజీకేఎస్ నాయకులు చుక్కల శ్రీనివాస్, సీఎంవోఏఐ నాయకులు వేణుగోపాల్‌రావు, రక్షణాధికారి పులి సురేశ్, పీఎంపీఎల్ ప్లాంటు మేనేజర్ అఖిల్‌కపూర్, అధికారులు పాల్గొన్నారు.

ఐకే1ఏ గనిపై..

ఇందారం ఐకే1ఏ గనిపై రక్షణ అవగాహన కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో వార్షిక లక్ష్యంలో 66.40లక్షల టన్నులు సాధించినందుకు ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఐకే1ఏ, ఐకే–ఓసీపీ అధికారి శ్రీనివాస్, మేనేజర్ ఆపరేషన్స్ నాగన్న, రక్షణాధికారి ఆత్మారాం, సంక్షేమాధికారి గౌస్‌పాషా, పిట్ కార్యదర్శి మల్లన్న పాల్గొన్నారు.

గొంతు నొక్కేందుకే అనర్హత వేటు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అక్రమాలు, వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్తున్న రాహుల్‌గాంధీ గొంతు నొక్కేందుకే ఆయనపై అనర్హత వేటు వేశారని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర విజయవంతంగా సాగుతోందని అన్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం మంచిర్యాలకు జిల్లాలోకి ప్రవేశిస్తుందని, యాత్ర పూర్తికాగానే మంచిర్యాలలో గానీ, సీసీసీలో గానీ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వడగండ్ల వానతో పంట నష్టం రాష్ట్రవ్యాప్తంగా జరిగిందని, కాళేశ్వరం పుణ్యమాని గత రెండేళ్లుగా ఏటా వర్షాకాలంలో మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లోని పంటలు కొట్టుకుపోయి, వరదతో పూర్తిగా వేలాది ఎకరాలు నష్టపోయాయని అన్నారు. జిల్లాలోని చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల్లో నీట మునిగిన పంటలకు నష్టపరిహారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో వేలాది ఇళ్లు వరద నీటిలో మునిగిపోయి, లక్షలాది రూపాయలను నష్టపోయారని, వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పశువులు పట్టివేత



పట్టుకున్న పశువులతో సభ్యులు

కెరమెరి: మండలంలోని కెలికే గ్రామంలో సోమవారం పశువుల రవాణాను గోరక్షక దళ సభ్యులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి కెరమెరికి ఐదు పశువులను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో సభ్యులు కాపు కాశారు. ఈక్రమంలో పశువుల మందతో రఫీక్ వస్తుండగా ఆయన్ను అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టుకున్న పశువులను గ్రామ పంచాయతీకి అప్పగించినట్లు సభ్యులు చోళే గోవింద్, బాణోత్‌రామ్ నివాస్, రాథోడ్ గజానంద్, జాదవ్ గోపాల్ తెలిపారు.

వైఎస్సార్‌టీపీ సేవాదళ్ కమిటీల నియామకం

మంచిర్యాలక్రైం: వైఎస్సార్‌టీపీ సేవదళ్ విభాగంలో జిల్లా, మండల, గ్రామ కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సతీశ్ ఆదేశాలతోనే సోమవారం నియమించినట్లు ఆ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గాదే సాయి తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గర్రెపెల్లి మనోజ్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా మునిగంటి రాజేంద్రప్రసాద్, మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా తనీర్ అరుణ్‌కుమార్, మండల అధ్యక్షుడిగా కొండ శివ, కాసిపేట మండల అధ్యక్షుడిగా గోసిక సంపత్, బెల్లంపెల్లి పట్టణ అధ్యక్షుడిగా పగిడి లక్ష్మణ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పులిదాడిలో గేదె మృతి



గేదె మృతదేహం

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి అటవీ ప్రాంతంలోని భీమన్నగుట్ట సమీపంలో ఆదివారం సాయంత్రం పులిదాడిలో గేదె మృతి చెందింది. చీలపెల్లి గ్రామానికి చెందిన సుర్పం అర్జుకు చెందిన గేదె అటవీప్రాంతానికి మేతకు వెళ్లి తిరిగి రాలేదు. అర్జు, గ్రామస్తులు కలిసి సోమవారం గాలించగా పులిదాడిలో గేదె మృతిచెంది కనిపించింది. అటవీశాఖ బీట్ అధికారులు సంతోష్, అరవింద్‌కు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పులిఅడుగు జాడలను గుర్తించారు. గేదెపై పులిదాడి చేసి హతమార్చిందని ఎఫ్ఆర్వో పూర్ణచందర్ తెలిపారు.

మాకూ 'పే స్కేల్' వర్తింపజేయాలి

- సెర్ప్ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలి
- వినతిపత్రాలు అందించి సిబ్బంది నిరసన
- ఉపాధి హామీ–సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్

ఉపాధి హామీ పథకం..	
ఏపీఓలు	12
కంప్యూటర్ ఆపరేటర్లు	65
సాంకేతిక సహాయకులు(టీఏ)	70
ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు	10
ప్లాంటేషన్ సూపర్‌వైజర్	2
సీడీ డీఎల్ఆర్‌సీ	2
అదనపు డీఆర్‌పీ	1
మొత్తం	162
సమగ్ర శిక్ష ఉద్యోగుల..	
క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు	51
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు	80
ఐఈఆర్‌పీలు	24
సీసీఓలు	12
కేర్ టేకర్లు	14
ఎంఐఎస్‌లు	12
మెస్సెంజర్లు	14
డీపీఓ ఉద్యోగులు	6
మొత్తం	213



ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో డీఆర్‌డీఓ శేషాద్రితో ఈజీఎస్ సిబ్బంది, కూలీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తమకు కూడా పే స్కేల్ వర్తింపజేయాలని ఉపాధి హామీ, సమగ్ర శిక్ష పథకాల ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 162 మంది, సమగ్ర శిక్ష పథకంలో 213 మంది వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకువస్తూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తుండడంతో జిల్లాలోని ప్రాజెక్ట్ మేనేజర్, 4 జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, 21 అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, 64 సీసీలు, 30 ఎంఎస్ సీసీలు, 5 సీసీఓలు, 4 ఆఫీస్ సబ్ ఆర్డినేటర్లు కలిపి మొత్తం 129 మందికి ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయి. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తామని గత ఏడాది సీఎం ఇచ్చిన హామీ మేరకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సెర్ప్ ఉద్యోగుల వేతనాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. దీంతో సెర్ప్ ఉద్యోగుల్లో సంబురాలు నెలకొన్నాయి. తమకు పే స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఇటీవల ఇటు ఈజీఎస్ అటు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశారు.

బడ్జెట్ ఆమోదం లేకున్నా జీతాలు ఇవ్వచ్చు..

ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉద్యోగులకు పే స్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌తో కానీ ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం కానీ లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కేంద్ర కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయిస్తోంది. ఉపాధి హామీ పనుల కోసం ఖర్చు చేసే నిధులలో పది శాతాన్ని ఉద్యోగుల వేతనాలకు కేటాయించడానికి పూర్తి అవకాశం ఉంది. ఉద్యోగుల వేతనాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు ప్రతీ ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వందల కోట్లలో మిగులుబాటు అవుతున్న విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని అంటున్నారు.

ఉద్యోగుల సమస్య గుర్తించాలి..



ఉపాధి హామీ పథకం కింద ఏళ్ల తరబడి పని చేస్తూ ప్రభుత్వానికి మా శ్రమను ధారబోస్తున్నాం. ఉపాధి కూలీలకు పని కలిపించడంతోపాటు ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నాం. ఉద్యోగులంతా ఒత్తిడిలోనూ రాణిస్తూ కూడా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తూ లక్ష్యాలను చేరుకుంటున్నాం.

– మల్లయ్య, ఈజీఎస్, ఏపీఓ, హాజీపూర్

విద్యాభివృద్ధికి కృషి..



సమగ్ర శిక్ష పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులుగా విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఏ కార్యక్రమం అప్పగించినా ఆ పనిని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని అందుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాల అములులో భాగస్వామ్యం అయిన తమపై ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకునేలా చూడాలి.

– పి.నగేశ్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, సమగ్ర శిక్ష

క్వారీలో శవమై తేలిన యువకుడు



సాయిరాం (ఫైల్)

బెల్లంపల్లి: ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు క్వారీలో పడి శవమై తేలిన ఘటన వెలుగుచూసింది. తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి చెందిన కళ్యాణం సాయిరాం (28) అనే యువకుడు కొద్ది రోజుల నుంచి తీవ్రమైన మానసిక ఒత్తిళ్లతో సతమతమవుతున్నాడు. మంచిర్యాలకు వెళ్లి వైద్యుడికి చూపించుకోగా మందులు రాసిచ్చాడు. ఈనెల 25న సాయిరాం ఇంట్లో నుంచి బైక్ పై బెల్లంపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈజీఎస్ పనులకెళ్లి ఇంటికి వెళ్తున్న సాయిరామ్‌కు తల్లి కనిపించింది. ఆమెతో మాట్లాడకుండానే వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటి తాళాలు ఎక్కడున్నాయో తల్లికి ఫోన్ చేసి చెప్పి సాయిరాం సాయంత్రం ఇంటికి తిరిగివస్తానని చెప్పాడు. కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న గొంతెమ్మ గుట్ట క్వారీ వద్దకు వెళ్లి బైక్‌ను అక్కడ పార్కింగ్ చేసి క్వారీలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు ఓ నోటు పుస్తకంలో అమ్మానాన్నలకు భారం కావొద్దని, బతికి ఏదైనా సాధించాలని రాసుకున్నట్లు తెలుస్తోంది. మానసిక ఒత్తిడిని భరించలేక సాయిరాం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని సోమవారం క్వారీ నుంచి బయటకు వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన ఆరుగురికి ఖానాపూర్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై రాజు తెలిపారు. సోమవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, జైలు శిక్ష విధించారన్నారు. వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలు అందజేశారు. రైతుబంధు, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. శాఖల అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొమురం బాలు, ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని ఈజ్‌గాం విలేజి నెంబర్ 10కు సమీపంలో గల రైల్వే పట్టాల పక్కన ఒక వ్యక్తి అనుమానస్పదంగా మృతిచెందాడు. కాగజ్‌నగర్ రైల్వే జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేశ్ గౌడ్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఒక వ్యక్తి రైల్వే పట్టాల కింద పడి ఉన్నట్లు అందిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లారు. క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించేలోపే మృతిచెందాడు. మృతుడిని గుప్తా ధర్మేందర్ కుమార్ (40)గా గుర్తించామని, మృతుడు నేపాల్ దేశానికి చెందిన వాడిగా పాస్‌పోర్టు జిరాక్స్ లభించిందని జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగని భూ ఆక్రమణలు

- నస్పూర్‌లో ఎకరం ప్రభుత్వ భూమి కబ్జా
- భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన కంచె

నస్పూర్: జిల్లాకేంద్రానికి ఆనుకొని ఉన్న నస్పూర్‌లో భూ ఆక్రమణలు ఆగడం లేదు. నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవనం ఏర్పడుతుండడం, కోల్‌బెల్ట్ ప్రాంతం కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొందరు రాజకీయ, ఆర్థిక, అంగబలంతో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సెలవు రోజునే సరైన సమయంగా ఎంచుకోవడం విశేషం. నస్పూర్ శివారు సర్వే నంబర్ 119లోని సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీని విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఎలాంటి అనుమతి లేకుండా సదరు భూమిలోకి వెళ్లడానికి దారిని ఏర్పాటు చేయడం విశేషం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ భూమని కొందరు కబ్జాకు ప్రయత్నించారు. అధికారుల చొరవతో విరమించుకున్నారు. తిరిగి ఆ భూమిని కబ్జా చేశారు. దీనిపై తహసీల్దార్ జ్యోతిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి వివరాలు సేకరిస్తామని తెలిపారు.

ఓసీపీల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

- భూ నిర్వాసితుల డిమాండ్
- గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



డీఎస్పీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఓసీపీల్లో స్థానికులే ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అత్మారాం నాయక్ మాట్లాడుతూ స్థానికుల నుంచి భూములు తీసుకుని ఏర్పాటు చేసిన సింగరేణి ఓసీపీల్లో ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలను నుంచి వందలాది మందిని తీసుకువచ్చి పనులు చేయిస్తూ స్థానిక యువతకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసిత యువతకు, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సింగరేణిలో భూములు కోల్పోయి ఉపాధి లేకుండా చేసిన యాజమాన్యం ఓబీ కాంట్రాక్ట్ సంస్థలకే వత్తాసు పలుకుతూ స్థానిక యువతకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన కూలీలను వెంటనే పంపించి స్థానిక యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ సెంటర్లలో ఆరోగ్యం, విద్యా పరంగా యాజమాన్యం పట్టించుపులేనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు అల్లం నరేందర్, వాంకిడి సీఐ శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆత్మారాంతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీజేపీ నాయకుడిపై కేసు

తిర్యాణి: కార్మికుల విధులకు ఆటంకం కలిగించిన బీజేపీ నాయకుడు ఆత్మారాం నాయక్‌పై కేసు నమోదైంది. ఖైరిగూడ ఓసీపీ పరిధిలోని జీఆర్ఎన్ ప్రైవేట్ కంపెనీలో సోమవారం విధులు నిర్వహించేందుకు వెళ్తున్న కార్మికులకు ఉల్లిపిట్ట ఎక్స్ రోడ్డు వద్ద ఆత్మారాం నాయక్ భయభ్రాంతులకు గురిచేశారని ఎస్అండ్‌పీసీ అధికారి రాజమౌళి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నస్పూర్: ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, ఆటోగ్యారేజి, ఏరియా స్టోర్, టింబర్ యార్డ్, ఆర్కే 8 డిస్పెన్సరీలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడుసార్లు నిర్వహించే మెడికల్ బోర్డు నెలకోసారి నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు రెస్ట్‌హాల్స్ మినరల్ వాటర్ సౌకర్యం, రేడియం జాకెట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వారికి ఇవ్వాల్సిన స్పెషల్ ఇన్సెంటివ్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా సిబ్బందికి స్పెషల్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాం, గరిగ స్వామి, నాయకులు పెట్టం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవిశంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'దళితుల అభివృద్ధికి తోడ్పడని ప్రభుత్వాలు'



మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి తగిన తోడ్పాటు అందించడం లేదని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు డీఆర్.శ్రీధర్, జిల్లాప్రధాన కార్యదర్శి దేవి పోశన్న అన్నారు. సోమవారం బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు 15 శాతం దళితుల అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో దళితులు వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. దళితుల సమస్యలు, భవిష్యత్ పోరాట కార్యక్రమాలు రూపకల్పనకు ఈ నెల 31న హైదరాబాద్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి రవి, నాయకులు జీసీ మాణిక్యం, నర్సింగరావు, ఆడేపు రాజమౌళి, బియ్యాల ఉపేందర్, వెంకటస్వామి, అక్కెపల్లి బాపు, జాడి పోశన్న, మామిడి గోపి, బండారు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సినీరంగంలో రాణిస్తున్న పాతబస్తీ యువకుడు

- దసరా సినిమాలో మూడు అవకాశాలు
- తెలంగాణ యాస భాషను ప్రపంచానికి పరిచయం చేస్తున్న సురేష్



కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి పంచాయతీ సోమగూడెం పాతబస్తీకి చెందిన గడ్డం సురేష్ సినీ రంగంలో రాణిస్తున్నాడు. పెద్ద బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమాలో ఏకంగా మూడు అవకాశాలు వచ్చాయి. దసరా సినిమాలో తెలంగాణ మాండలికం(డైలాగ్) రైటర్, పాటల రచయిత, కళాకారుడు(నటుడు)గా చేసి ఒకేసారి పెద్ద గుర్తింపు తెచ్చుకున్నాడు. శ్రీలక్ష్మి వేంకటేశ్వర సినిమా(ఎస్ఎల్‌వీసీ) బ్యానర్‌లో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ నిర్మించిన, ప్రముఖ నటులు నాని, కీర్తి సురేష్, సాయికుమార్, దీక్షితశెట్టితో తీసిన దసరా తెలంగాణ యాస డైలాగ్‌లు ప్రపంచానికి పరిచయం కానున్నాయి. ఐదు భాషల్లో తీసిన సినిమా ఈనెల 29న అమెరికాలో విడుదల అవుతుండగా, 30న పలు రాష్ట్రాల్లో విడుదల కానుంది. ఈనెల26న అనంతపూర్‌లో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేపట్టడంతో సినిమా నిర్వాహకులు, హీరోలు సురేష్‌ను కొనియాడారు. దీంతో కాసిపేట మండలంతోపాటు కోల్‌బెల్టు ప్రాంతాలైన బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో ఈవెంట్ దసరా సినిమా పాటలు వాట్సాప్ గ్రూప్‌లో, స్టేటస్‌ల్లో చక్కర్లు కొడుతున్నాయి.

సంతోషంగా ఉంది

సినిమాల్లో అవకాశాల కోసం కళాకారులు ఎదురు చూస్తూ గడుపుతున్నారు. పెద్ద బ్యానర్‌పై నిర్మిస్తున్న ఒకే సినిమాలో రైటర్, అర్టిస్ట్, పాటల రచయితగా అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు, నిర్మాత, నటులు అందరూ ఆదరించారు. ప్రస్తుతం మంచి అవకాశాలు వస్తున్నాయి.

– గడ్డం సురేష్

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



సీఈవో రాకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మానెపల్లి బాపుపై 8 మంది సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు తీర్మానం కోరుతూ సీఈవో రాకేశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 31న ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహిస్తామని, సభ్యులు హాజరుకావాలని సీఈవో నోటీసులు జారీ చేశారు. 31న సభ్యులు చేసిన తీర్మానాన్ని జిల్లా అధికారికి నివేదిస్తామని పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



సుఖప్రసవం అనంతరం మహేశ్వరితో సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్‌కు చెందిన సీడం మహేశ్వరి సోమవారం ప్రతిస్పందన అంబులెన్స్‌లో ప్రసవించింది. నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో మెడికల్ టెక్నీషియన్ 108 కాల్ సెంటర్ వైద్యుడి సూచనల మేరకు మహేశ్వరికి సుఖప్రసవం జరపగా మగశిశువుకు జన్మనిచ్చింది.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి



కోణంపేటలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన

నెన్నెల: ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కల్పన రైతులకు సూచించారు. మండలంలోని కోణంపేట, పాటి గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించారు. పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. యంత్రాలను ఉపయోగించి కూలీల ఖర్చులు తగ్గించుకోవాలని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుబీమా తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే సాయంగా వచ్చే రూ.5లక్షలతో ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని అన్నారు. పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలని, పీఎం కిసాన్ డబ్బులు బ్యాంకు ఖాతాలకు బదులు కొందరు రైతుల పోస్టల్ ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. నెన్నెల ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.